క్లుప్తంగా

పంట నమోదు ప్రక్రియ పరిశీలన



లొల్లలో పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో ప్రభాకర్

రాయవరం: మండలంలోని లొల్ల, మాచవరం గ్రామాల్లో పంట నమోదు ప్రక్రియను మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ మంగళవారం పరిశీలించారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా ఆయన పంట నమోదు ఏ విధంగా జరుగుతున్నదీ చూశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలన్నారు. లేకుంటే ధాన్యం అమ్ముకునే సమయంలో, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన పంటకు పరిహారం, పంటల బీమా, సున్నా వడ్డీ, ఇతర వ్యవసాయ పథకాలకు అర్హత కోల్పోతారన్నారు. ఈ నెల 15తో పంట నమోదుకు గడువు ముగుస్తుందన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. మండలంలో 14,561 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఇప్పటి వరకు 7,421 ఎకరాల్లో పంట నమోదు పూర్తయిందన్నారు.

పందుల స్వైరవిహారాన్ని నిరోధించాలి



కాజులూరులో రోడ్డుపై సంచరిస్తున్న పందులు

కాజులూరు: గ్రామంలో రోజురోజుకీ పెరుగుతున్న పందుల స్వైరవిహారాన్ని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పందుల పెంపకం ద్వారా ప్రమాదకరమైన అంటు వ్యాధులు సోకుతాయని వైద్యులు సూచిస్తున్నప్పటికీ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పెంపకందార్లు విచక్షణా రహితంగా వాటి సంఖ్యను పెంచుతూ గ్రామంలోకి వదులుతున్నారు. అవి గ్రామంలోని డ్రైనేజీలలో పొర్లుతూ పరిసరాలను అస్తవ్యస్తం చేస్తున్నాయి. దీంతో భరించలేని దుర్వాసన వస్తూ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పందుల పెంపకాన్ని నిరోధించాలని గ్రామానికి చెందిన పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వంద రోజుల పని దినాలు కల్పించాలి



ఉపాధి హామీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న పీడీ మధుసూదనరావు

రామచంద్రపురం రూరల్: ఉపాధి కూలీలు ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలని డ్వామా పీడీ పి.మధుసూదనరావు ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. మంగళవారం రామచంద్రపురం క్లస్టర్ పరిధిలోని 6 మండలాల సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రతి ఉపాధి కూలీ ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సత్యనారాయణ, ఏపీఓలు జి.అరుణకుమారి, లక్ష్మీగణపతి, జి.కవిత, సుధారాణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

రాజోలు: రాజోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీఓ రమాదేవి మంగళవారం తెలిపారు. రాజోలు మండలం చెన్నడంలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు (ఎస్టీ), అంగన్‌వాడీ హెల్పర్ బి.సావరం (బీసీ–బీ), కూనవరం(ఎస్సీ), సఖినేటిపల్లి మండలం మోరిపోడు ముప్పర్తివారిపాలెం (బీసీ–డీ) పోస్టులకు ఆయా గ్రామాలకు చెందిన వివాహితలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 7 నుంచి 16 వరకు దరఖాస్తులను రాజోలు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఇవ్వాలన్నారు.

ఉపాధ్యాయులే సమాజ శిల్పులు

- ఘనంగా గురుపూజోత్సవం
- ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



రాయవరంలో జిల్లా, మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



కలెక్టర్, ఎమ్మెల్సీల చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న స్వామిప్రసాద్

రాయవరం: తరగతి గదిలో విద్యార్థిని తీర్చిదిద్దే విధానంపైనే సమాజం, దేశ భవిష్యత్ ఆధారపడి ఉంటుందని, అటువంటి ఉపాధ్యాయులే సమాజ శిల్పులని మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో మంగళవారం మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసే విధంగా ఉపాధ్యాయుల బోధనా పటిమ ఉండాలన్నారు. విద్యారంగానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. సమావేశంలో ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, ఎంఈఓలు పి.లక్ష్మణమూర్తి, యరమాటి సూర్యనారాయణ, సర్పంచులు చంద్రమళ్ల రామకృష్ణ, చాట్రాతి జానకిరాంబాబు, కత్తుల సీతామహాలక్ష్మి, వాసంశెట్టి వెంకట్రావులు మాట్లాడారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయుడు యాకల సూర్యనారాయణ మూర్తి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత యాకల వెంకట రామకృష్ణారావు, మండల కాంప్లెక్స్‌ల పరిధిలో మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మాచవరం ఎంపీటీసీ పలివెల శోభన తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు.

సేవలకు గుర్తింపు




ముత్యాల శ్రీనివాస్

మండపేట: ద్వారపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు గండి స్వామిప్రసాద్, ఇప్పనపాడు మండల పరిషత్ ప్రాథమిక మెయిన్ పాఠశాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు సున్నపు వీరభద్రరావులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. మంగళవారం ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, డీఈఓ కమలకుమారి, జిల్లా ఉప విద్యా శాఖాధికారి పి.షాలెంరాజు చేతుల మీదుగా వారు అవార్డులను స్వీకరించారు. జన విజ్ఞాన వేదిక సైన్స్ ప్రచార కార్యక్రమంలో గండి స్వామిప్రసాద్ పాల్గొంటూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను వృద్ధి చేస్తున్నారు. స్వామిప్రసాద్‌ను జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చల్లా రవికుమార్, జిల్లా అధ్యక్షుడు ఈఆర్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ అభినందించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా శ్రీనివాస్

కపిలేశ్వరపురం: వెదురుమూడి ప్రాథమికోన్నత పాఠశాల పీఎస్ స్కూల్ అసిస్టెంట్, హెచ్ఎం ముత్యాల శ్రీనివాస్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయన సారథ్యంలో పాఠశాలకు మూడు సార్లు ఇన్‌స్పైర్ అవార్డులు దక్కాయి. శ్రీనివాస్‌ను ఎంఈఓ కె.తాతారావు, ఎంఐఎస్ టి.సురేష్, సీఆర్పీలు, సహ ఉపాధ్యాయులు అభినందించారు.

ఆకట్టుకున్న చిత్రం



ఉపాధ్యాయుడు విద్యార్థులకు జ్ఞానాన్ని అందిస్తున్నట్లు గీచిన చిత్రం



ఇండిగమిల్లి సొదాగర్

రాయవరం: స్థానిక చిత్రకారుడు ఇందుగమిల్లి సొదాగర్ ఉపాధ్యాయ దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజెప్పే చిత్రాన్ని తన కుంచెతో మలిచాడు. వాటర్ కలర్స్‌తో రూపొందించిన ఈ చిత్రం ఆలోచింపజేసింది. ఉపాధ్యాయుడు కొవ్వొత్తిగా మారి తన జ్ఞానాన్ని విద్యార్థుల బుర్రల్లో నింపుతున్నట్లు ఈ చిత్రం గీశారు.

గురువర్యా వందనం..



విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సమాఖ్య నేతలు



ఉత్తమ, విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కె.గంగవరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు

రామచంద్రపురం రూరల్/కె.గంగవరం/కాజులూరు/రామచంద్రపురం: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. సర్వేపల్లి రాధాకృష్ణ అందించిన సేవలను, ఆయన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయులను ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కె.గంగవరం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పామర్రు ఉన్నత పాఠశాలలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు గ్రామానికి చెందిన నేమాని దేవికారాణి 25 మందికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున నగదు పురస్కారం అందించారు. అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. గురుపూజోత్సవం సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కాజులూరు మండల గ్రామాల నుంచి మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కె.సుందరి (ఆర్యావటం), పి.శేషమహాలక్ష్మి (కాజులూరు ఏ.సి), సీహెచ్ నూకరాజు (మంజేరు హెచ్) కేఎస్‌బీ మాణిక్యాంబ(దుగ్గుదుర్రు), కేడీఎల్ విజయకుమారి (కోలంక), ఎం.నరసింహమూర్తి (తర్లంపూడి)లను ఎంఈఓలు పి.జాన్, వివేకానంద, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు. రామచంద్రపురంలో విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు జీవీ శివన్నారాయణ, బిక్కిన సత్యనారాయణ, శివన్నారాయణ, పళ్లంరాజు, టి.రాఘవరాజు, ఎస్.భాస్కరరావు, విశ్రాంత అధ్యాపకుడు బీహెచ్ భాస్కరశర్మలను సమాఖ్య ఘనంగా సత్కరించింది. భాస్కరరావు సమాఖ్య సేవా కార్యక్రమాలకు పదివేల రూపాయల నగదు అందజేశారు. కృత్తివెంటిలో పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎం.రామారావు ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీఎస్ఎం అటానమస్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలను గురుపూజోత్సవంగా నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలైన ఉపాధ్యాయులకు అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. పట్టణంలోని వికాస్ విద్యా సంస్థల అధినేత వీవీ రమణ నేతృత్వంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో టీచర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న దుర్గాదేవి



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకుంటున్న రాజు

కె.గంగవరం: మండలంలోని ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులు మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులు పురస్కారాన్ని అందుకున్నారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో జరిగిన గురుపూజోత్సవం వేడుకలో జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా చేతుల మీదుగా మండలం నుంచి ఎంపికైన బాలాంత్రం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని యం.దుర్గాదేవి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్నారు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా దంగేరు ఉన్నత పాఠశాల హెచ్ఎం నేతునూరి రాజు అవార్డు అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకోవడంపై ఎంఈఓ నాగరాజు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ తదితరులు అభినందించారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కాజులూరు: రాష్ట్రంలో రైతు సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. మండలంలోని తణుకువాడ, శలపాక, గొల్లపాలెం తదితర గ్రామాల్లో మంగళవారం బుల్లిరాజు పర్యటించి ఆర్బీకేలను సందర్శించారు. గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ గతంలో రైతులు పంట పెట్టుబడులకు సొమ్ములు లేక కాబోలీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఆర్థికంగా నష్టపోయేవారన్నారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రైతులకు సకాలంలో పెట్టుబడి సాయాన్ని అందించి ఆదుకుంటుందన్నారు. సొంతంగా భూమి సాగుచేసే రైతులతో పాటు కౌలురైతులు, అటవీ భూములు, దేవదాయ శాఖ భూములు సాగుచేసే రైతులకు ప్రభుత్వం ఈ పెట్టుబడి సాయాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్‌లు డీవీ రమణ, వాసంశెట్టి శ్రీనివాస్, పితాని సత్యనారాయణ, స్థానిక రైతులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభం

ఆలమూరు: గ్రామంలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విక్రమ భట్టేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రావాడ సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో ఈనెల ఐదు నుంచి ఏడు వరకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా బ్రహ్మశ్రీ కాళ్ళకూరి దుర్గాప్రసాద్ శర్మ పర్యవేక్షణలో వేద పండితులు పూజలు, హోమాలు ప్రారంభించారు.

ఆర్డీవోకు వినతి పత్రం



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న బలరాం తదితర సీఐటీయూ, సీపీఎం నేతలు

రామచంద్రపురం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో పి.సిందూ సుబ్రహ్మణ్యంకు వినతి పత్రాన్ని అందజేశారు. నిరుద్యోగం, విద్యుత్ చార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా కేంద్ర నాయకత్వం ఇచ్చిన పిలుపులు భాగంగా మంగళవారం, సీఐటీయూ, సీపీఎం పార్టీ సభ్యులు ధర్నా నిర్వహించారు. సీపీఎం పార్టీ జిల్లా నాయకులు నూకల బలరాం మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. అధిక ధరలను అదుపు చేయాలని, కరెంట్ చార్జీలు తగ్గించాలని, ఉద్యోగాలు కల్పించాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌బీఎస్ఆర్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం



ద్వారపూడిలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న కనకరాజు, బులిస్వామిరెడ్డి

మండపేట: మండలంలో అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని ద్వారపూడిలో శ్రీఅయ్యప్ప స్వామి ఆలయ వ్యవస్థాపకుడు ఎస్ఎల్ కనకరాజు గురుస్వామి అన్నారు. ద్వారపూడిలో అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానికంగా నిర్వహిస్తున్న బాల మణికంఠ పాఠశాల విద్యార్థులకు మంగళవారం శ్రీసత్ లక్షణ ప్రతిభా పురస్కారాలను, ప్రోత్సాహక బహుమతులను కనకరాజు గురుస్వామి చేతుల మీదుగా బులిస్వామిరెడ్డి అందజేశారు. పాఠశాలలో ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.25 వేల విలువైన నగదు ప్రోత్సాహక బహుమతులను, మేధస్సును పెంపొందించే పుస్తకాలను అందజేశారు. కనకరాజు మాట్లాడుతూ ఎస్‌బీఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు బులిస్వామి రెడ్డి తమ ట్రస్ట్ ద్వారా మండపేట, అనపర్తి నియోజకవర్గాల్లోని మహిళల ఆర్థిక పరిపుష్టికి విశేష కృషి చేస్తున్నారన్నారు.

శరవేగంగా ఈ-క్రాప్ నమోదు

- పూర్తి పంట వివరాల నమోదుకు ఆస్కారం
- నియోజకవర్గంలో 46 శాతం పూర్తి



కె.గంగవరం మండలంలో ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్న వ్యవసాయ సహాయకులు

కె.గంగవరం: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ ఈ–క్రాప్ బుకింగ్‌ను వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా ప్రభుత్వ నిర్దేశించిన సమయానికి పూర్తి చేసేందుకు శరవేగంగా నమోదు చేస్తున్నారు. దీని ద్వారా సంబంధిత యాప్‌లో రైతు పేరు, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు, ఏ ఏ పంటను వేశారో వంటి వివరాలను నమోదు చేస్తారు. ఈ–క్రాప్ బుకింగ్స్ ద్వారా కచ్చితమైన పంట గణాంకాలను నమోదు చేయడం జరుగుతుంది. విపత్తుల సమయంలో పంట నష్టపోతే పరిహారం అందించడే కాకుండా పలు ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయి రైతులకు అందేలా ఈ–క్రాప్ ఉపకరిస్తుంది.

పంట సాగు విస్తీర్ణం

నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండలాల్లో సుమారు 21,688 హెక్టార్లలో వరిసాగు చేస్తున్నారు. కె.గంగవరం మండలంలో 6344 హెక్టార్లు, కాజులూరు మండలంలో 7702 హెక్టార్లు, రామచంద్రపురం మండలంలో 7642 హెక్టార్లలో వరిసాగు జరుగుతుంది.

ఈ క్రాప్ నమోదు ఇలా..

ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లో సంబంధిత అధికారులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ–క్రాప్ నమోదు చేస్తారు. రైతుల పొలం వద్దకు అంటే సర్వే నంబర్ ప్రకారం అధికారులు వెళ్లి ట్యాబ్‌లో యాప్ ఓపెన్ చేసి క్లిక్ చేయగానే 20 మీటర్ల పరిధిలోని సర్వే నంబర్లు కనిపిస్తాయి. అనంతరం ఆ సర్వే నంబర్‌లో రైతు పేరును నిర్ధారణ చేసుకుని యాప్‌లో ఏ పంట వేశారో నమోదు చేస్తారు. పొలం వద్దే రైతు ఫొటో తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేసి వెంటనే ఆధార్ నంబర్, ఫోన్ నంబర్ నమోదు చేయాలి. దీంతో ఆ సర్వే నంబర్‌కు ఏ కాలువ నుంచి సాగునీరు వస్తుంది. నీటి తీరువా ఎంత చెల్లించాలి వంటి వివరాలు తెలుస్తాయి. పంట చిత్రాలను జీపీఎస్ పద్ధతి ద్వారా సర్వర్‌కు పంపుతారు. సర్వే నంబర్‌లో తేడాలను అధిగమించేందుకు వీఆర్ఓలు, ఎంపీఈఓలు సంయుక్తంగా ఈ ప్రక్రియను కొనసాగిస్తారు. ఈ నెఖారులోగా పంట వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది చురుగ్గా ఈ–క్రాప్ బుకింగ్స్ చేస్తున్నారు.


తప్పనిసరిగా చేయించుకోవాలి



ఎట్టి పరిస్థితిలోనూ రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి. ఇప్పటికే కె.గంగవరం మండలంలోని శేరిలంక మినహా మిలిగిన 25 గ్రామాల్లోను ఈ–క్రాప్ బుకింగ్స్ చేస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం వాటిల్లినప్పుడు ఈ–క్రాప్ ఎంతగానో మేలు చేస్తుంది.

– బందారు శ్రీరాములు, వ్యవసాయ సహాయకుడు, పాణింగపల్లి

పక్కాగా నమోదు చేస్తున్నాం



ఈ–క్రాప్ బుకింగ్స్‌ను నిబంధనలకు అనుగుణంగా పక్కాగా నమోదు చేస్తున్నాం. నమోదు ప్రక్రియ వ్యవసాయ సహాయకులు, వీఆర్‌ఓలు సంయుక్తంగా చేస్తున్నారు. ఖరీఫ్ పంటల నమోదులో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తాం.

– బలుసు రవి, ఏఓ, కె.గంగవరం

పోలమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు



రాయవరంలో పోలమ్మతల్లి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రాయవరం: స్థానికంగా భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్న పోలమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం జరిగాయి. ఇందులో భాగంగా ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాయవరం, కొమరిపాలెం, వెదురుపాక, వి.సావరం, లొల్ల, సోమేశ్వరం, అనపర్తి మండలం కొప్పవరం, మహేంద్రవాడ తదితర గ్రామాలకు చెందిన భక్తులు ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ గ్రామాలకు చెందిన పలు భజన మండళ్ల ఆధ్వర్యంలో ఏకాహం నిర్వహించి భజన పాటలు ఆలపించారు. గ్రామానికి చెందిన ఓంశక్తి సంఘం సభ్యులు, సత్యసాయి సంఘం వారు గీతాపారాయణ చేశారు. ఎంపీపీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ వార్షికోత్సవ వేడుకలను పర్యవేక్షించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

నేడు చెల్లూరులో గడప గడపకూ..

రాయవరం: చెల్లూరులో బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ నౌడు వెంకటరమణ మంగళవారం విలేకరులకు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చతుర్వర్ష ప్రణాళికపై అవగాహన

మండపేట: స్థానికంగా చతుర్వర్ష ప్రణాళికపై జమాయితె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ రఫీఖ్ మాట్లాడుతూ తమ సంఘం ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. వచ్చే నాలుగేళ్లలో సామాజిక కార్యక్రమాలతో దేశవ్యాప్తంగా వడ్డీ రహిత బ్యాంక్‌ల ఏర్పాటుకు కృషి చేస్తుందన్నారు. సంఘ కార్యదర్శి ఎస్.షరీఫ్, శిక్షణ కార్యక్రమ పర్యవేక్షకుడు మొహమ్మద్ షరీఫ్, జిల్లా అధ్యక్షుడు షేక్ అమీర్, పట్టణ అధ్యక్షుడు అబుల్ ఆలా పాల్గొన్నారు.